





అమరావతికి.. అందలం

వెలుగులు.. ఆదాయం



పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీమ్ కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చనుంది. దాదాపు గా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని ఈ పథకం ద్వారా పొందవచ్చు. ఇందుకోసం ఏర్పాటు చేసే సోలార్ ప్యానెల్స్ యూనిట్‌కి అయ్యే ఖర్చులో రూ.60 వేల వరకు సబ్సిడీ, మిగతా రూ.లక్ష రుణం రూపంలో సమకూరుస్తారు. వినియోగదారుడు వినియోగించగా మిగిలే విద్యుత్‌ని విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి.

ఆక్వాకి.. అండ

బాపట్ల జిల్లాలోని ప్రధాన రంగాల్లో ఆక్వా ప్రముఖం గా ఉంది. దాదాపు 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో ఈ రంగానికి అండగా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటనలు వెలువడ్డాయి. ముఖ్యంగా రొయ్యలు, చేపల మేతపై



పన్నును 5 శాతానికి తగ్గించారు. దీని వల్ల మేత రేటు తగ్గి పెట్టుబడి ఖర్చుల్లో భారీ తేడా వస్తుంది. తద్వారా ఆక్వారంగం పునర్ వైభవం సాధించడానికి ఇది ఉపయోగపడుతుందనేది రైతుల మాట. రొయ్యల సాగు కేంద్రాల నెట్‌వర్క్‌లు ఏర్పాటుకి ప్రత్యేక ఆర్థిక సాయం అందించడంతో పాటు నాబార్డ్ ద్వారా దీనిని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. మొత్తం మీద కేంద్రం ఆక్వా రంగ అభివృద్ధికి ప్రత్యేక విధానాన్ని తీసుకురావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల కష్టాలు తీరినట్లే..



గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులను వేధించింది. వారికి ఏటా చెల్లించాల్సిన కౌలు కూడా చెల్లించలేదు. గడిచిన రెండేళ్లుగా రైతులకు ఇవ్వాల్సిన రూ.380 కోట్ల కౌలు చెల్లించకపోవడంతో రైతులు అప్పులపాలై అల్లాడుతున్నారు. పిల్లలచదువులకు ఫీజులు కూడా కట్టుకోలేని దయనీయ స్థితిలో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం నుంచి నిధులు రావడంతో వారు ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. రాజధా నికి కేంద్ర నిధులు వస్తుండడంతో తమ కష్టాలు తీరనున్నాయని వారు ఆనందంలో ఉన్నారు.

మోదీ 3.0 బడ్జెట్ అమరావతి బాట పట్టింది. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో ఊసే లేకుండా పోయిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి బాధ్యత మాదంటూ కేంద్రం బడ్జెట్‌లో భరోసా ఇచ్చింది. నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంపై అటు రాష్ట్రప్రజలతో పాటు అమరావతి వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అటు తరతరాల నుంచి ఉన్న భూములను అమరావతి కోసం ఇచ్చి జగన్ నిర్లక్ష్యం తో రోడ్డెక్కిన రాజధాని రైతులకు భరోసా ఇస్తూ కూటమి ప్రభు త్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లావాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ అమరావతికి ప్రాధాన్యం ఇవ్వడంపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమ వుతున్నాయి. ప్రత్యేకంగా నిధులతో పాటు రాజధాని కార్యకలా పాలకు అండగా ఉంటామన్న కేంద్రం ప్రకటనతో ఇక అమరావతి అభివృద్ధికి ఢోకా ఉండదని తెలుస్తోంది. కాగా అమరావతికి ప్రత్యేక కేటాయింపులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలు అమరావతికి క్యూ కట్టనున్నాయి. దీంతో అమరావతి దశ తిరిగిపోయినట్లే.

- కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం
- పరుగులు పెట్టనున్న నవ నగర నిర్మాణాలు
- నిధుల కేటాయింపుతో రాజధాని దశ తిరిగినట్లే
- రూ.15 వేల కోట్ల కేటాయింపుపై రైతుల్లో హర్షం
- కష్టాలు తీరిపోయాయన్న ఆనందంలో రైతులు

గుంటూరు, బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ అమరావతి అంటే ఆగిపోయిన భవనాలు, అడవిలా మారిన గ్రామాలు, ఆవేదనా భరితమైన రైతులు. కానీ నేడు అది పూర్తిగా మారిపోయింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి తలరాత మారిపోయింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఇక దేదీప్యమానంగా వెలగబోతోందని మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో స్థానం కల్పించింది. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు సహాయాన్ని ప్రకటించింది. అమరావతి నిర్మాణ అవసరాల రీత్యా భవిష్యత్తులో మరింత సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా పార్లమెంటులో ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి సంబంధించి నిధులు సేకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ఫైనాన్సు సంస్థల ద్వారా రుణాలు సేకరించుకునేందుకు అవకాశం కూడా కల్పించింది. దీంతో అమరావతి నిర్మాణానికి ఇక ఎలాంటి ఢోకా లేదని తేలిపోయింది.

కుట్రలకు ముగింపు

2014 నుంచి 2019 వరకూ రాజధాని అమరావతి నిర్మాణం పరుగులు పెట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ అమరావతిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించింది. మూడు రాజధానులను తెరమీదకు తెచ్చి అమరావతిని విచ్ఛిన్నం చేయడంతో పాటు, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో అమరావతికి స్థానం కల్పించడం, బడ్జెట్ నిధులు కేటాయించడంతో ఆ కుట్రలకు తెరపడినట్లయింది. ఆంధ్రుల రాజధాని అమరావతేనని కేంద్రం విస్పష్టంగా చెప్పినట్లయింది. దీంతో అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేరని సందేశమిచ్చింది. కాగా కేంద్రం కేటాయించిన నిధులతో అమరావతిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాలన్నీ నిధుల కొరత లేకుండా పూర్తైపోనున్నాయి.

మౌలికంగా ఊరట

కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల్లో భరోసా నింపింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటన్నింటికి మరమ్మతులు చేసేలా కేంద్రం బడ్జెట్‌లో వాటికి ప్రాధాన్యం ఇచ్చింది. గడచిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దారుణంగా ఛిద్రమైన రహదారులు బాగుపడనున్నాయి. కేంద్రం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల మొత్తం పెరగనుండటంతో రోడ్లకు మహర్దశ కలగనుంది. యువతకు విద్యారుణాలతో పాటు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇది కూడా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చేదే కావడం గమనార్హం. గ్రామీణాభివృద్ధికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరపడం, ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీలాంటి వన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి దోహదం చేసేవిగా ఉన్నాయి. విద్య, నైపుణ్యాభివృద్ధికి కేటాయింపులతో పాటు ఉపాధి కల్పన విషయంలోనూ ప్రత్యేక ప్రణాళికలను కేంద్రం ప్రకటించడం జిల్లాలోని యువతరానికి ఆశలు రేకెత్తించేవిగానే ఉన్నాయి. రూ.3 లక్షల వార్షికాదాయం లోపు ఉన్న వారికి ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా పన్ను రేట్ల శ్లాబులను సవరించడంపై ఉద్యోగ, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచినందున గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు లభించనున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద భారీగా రైతులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లను నిర్మించి ఇక్కడికి వచ్చే వలస కూలీలకు ఆవాసం కల్పించేందుకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమౌతున్నది.

ఇక.. ప్రకాశం



కేంద్ర ప్రకటించిన బడ్జెట్‌లో ఉమ్మడి ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాలో జాబితాలో చేర్చి ప్రత్యేకంగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది. గతంలో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా ఉండిన చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్నాయి. కేంద్రం ప్రకటన వల్ల ఈ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపులో సముచిత స్థానం దక్కనుంది. అదే విధంగా జిల్లాలోని వెనకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాని వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం వెనక సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెల వ్యవధిలోనే సీఎం హోదాలో కేంద్రం నుంచి రాబట్టడంపై మంత్రి గొట్టిపాటి ఆనందం వ్యక్తం చేశారు.

కుట్రలకు తెర



అమరావతిపై గత ప్రభుత్వం చేసిన కుట్రలకు తాజా బడ్జెట్‌తో తెరపడింది. అమరావతిని కేంద్ర ప్రభుత్వం గుర్తించడమే కాకుండా, నిధులు కూడా కేటాయించింది. దీంతో రాష్ట్రానికి రాజధాని అమరావతేనని ఖాయమైపోయింది. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా రాజధానిని మార్చడం అసంభవం. ఇక వారి కుట్రలకు కాలం చెల్లిపోయినట్లే. **- లంకా సుధాకరరావు, రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు**

మా ఆవేదనకు సమాధానం



ఐదేళ్ల మా ఆవేదనకు సమాధానం దొరికింది. కేంద్రం బడ్జెట్ కేటాయించడం ద్వారా తాము రైతుల పక్షాన ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఐదేళ్ల మేం పడిన కష్టాలు ఇక తీరిపోతాయని భావిస్తున్నాం. మాకు రావాల్సిన కౌలు బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- మాదాల పున్నయ్య, మందడం రైతు

అభివృద్ధికి ఢోకా లేదు



ఇప్పటి వరకూ గుర్తించని అమరావతికి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఢోకా ఉండదు.

- రామినేని చిన్నా, నెక్కల్లు రైతు

సొంతింటి కల సాకారం



ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల సొంత ఇంటి కలని సాకారం చేస్తామని కేంద్రం ప్రకటించింది. సొంతింటి నిర్మాణానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.67 లక్షల వరకు సబ్సిడీగా అందించనుంది. పీఎంఏవై కింద ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ-1, ఎంఐజీ-2 కేటగిరీల కింద ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఆర్థికసాయం అందించనున్నది. అలానే ఎఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్(ఏహెచ్‌పీ), బీఎల్‌సీ కింద నిర్మించే ఇళ్లకు కూడా ఆర్థికసాయం అందుతుంది. ఈ రెండు కేటగిరీల కింద ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.1.50 లక్షలను సబ్సిడీగా ఇస్తుంది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద సాయం పొందేవారి వార్షికాదాయం రూ.3 లక్షల లోపు, ఎల్ఐజీ గ్రూపు కుటుంబాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, ఎంఐజీ-1 కింద రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య, ఎంఐజీ-2 కింద రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల ఆదాయం పొందే వారికి పీఎంఏవై వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ లబ్ధిదారులకు రూ.2.20 లక్షలు, ఎల్ఐజీ కుటుంబాలకు రూ.2.67 లక్షలు, ఎంఐజీ-1 వారికి రూ.2.35 లక్షలు, ఎంఐజీ-2 వారికి రూ.2.30 లక్షల సబ్సిడీ వస్తుంది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో సొంత ఇళ్లని కొనుగోలు చేసే అవకాశం ఉన్నది. అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసేవారికి కూడా ఈ స్కీమ్ కింద ఆర్థికసాయం అందుతుంది. ఈ పథకంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని భవన నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.

నిర్మాణాలు ఇక పరుగులు..

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత కంపచెట్ల తొలగింపుతో మొదలై మెల్లగా నిర్మాణ పనుల వైపుగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రత్యేకంగా కేటాయింపులతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా సాయం చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతికి నిధుల కొరత కొంత మేర తీరినట్లయింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన అద్భుత భవనాలు పూర్తయ్యే వీలు కలిగింది. దీంతో 90 శాతం పూర్తయిన ఆలిండియా ఉద్యోగుల భవనాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ సముదాయాలు, గ్రూప్-4 ఉద్యోగుల భవన సముదాయాలు పూర్తవడానికి ఇక ఎంతో సమయం పట్టకపోవచ్చు. వాటితోపాటు మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు కూడా వేగంగా పూర్తవుతాయి. కాగా ఐకానిక్, సచివాలయ టవర్స్, అసెంబ్లీ భవనాల నిర్మాణం కూడా చకచకా సాగనున్నది.



అడ్మిషన్లు.. అదుర్స్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 75 శాతం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ
- పక్క రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ చేరికలకు ఈ ఏడాది ఫుల్‌స్టాప్



గుంటూరు(విద్య), జూలై 23: ఒకవైపు ఊపందుకోనున్న అమరావతి నిర్మాణాలు.. మరోవైపు విశాఖలో ఐటీ కారిడార్ ఏర్పాటుకు ఏర్పాట్లు.. ఇంకోవైపు భారత్ పెట్రోలియం ఆయిల్ రిఫైనరీ సంస్థ ఏర్పాటుకు సన్నాహాలు.. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల కంపెనీలు పెట్టుబడులపై ఆసక్తి.. ఈ నేపథ్యంలో పెరగనున్న ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ఏడాది తొందరగా ప్రారంభమైన ప్రక్రియ తో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు ఊపువచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గతానికి భిన్నంగా ఈ ఏడాది తొలి విడత కౌన్సెలింగ్‌లోనే కొన్ని కళాశాలల్లో 75 శాతానికిపైగా సీట్లు, మరికొన్ని కళాశాలల్లో నూరుశాతం సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలే ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు లక్ష ర్యాంకు దాటిన వారే సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిల వైపు చూసే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది 26 వేల నుంచి 75 వేల ర్యాంకులు వచ్చిన వారు కూడా ఆయా బ్రాంచీల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇక కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో అయితే 2వేల ర్యాంకులు వచ్చిన వారి నుంచే ఏడాది చేరికలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఇంజనీరింగ్ మొదటి, ద్వితీయ సంవత్సరాలు చదివే విద్యార్థులు తాము కోర్సులు పూర్తి చేసే సరికి రాష్ట్రంలో ఐటీ, కెమికల్, సివిల్, మెకానికల్ రంగాల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందనే భావనలో ఉన్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలు ద్విచక్ర, కార్లు తయారీకి రాష్ట్రంలో సానుకూల అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రా నిక్స్ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయని ఇంజనీరింగ్ కళాశాలల యాజ మాన్యాలు చెబుతున్నాయి. ఇక భారత్ పెట్రోలియం వంటి సంస్థలు రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయి. ముడి ఆ యిల్ నుంచి పెట్రోల్, డీజిల్, ఇతర ఉప వస్తువుల తయారీలో కెమి కల్ ఇంజనీర్లదే కీలక భూమిక. అంతేకాకుండా రిఫైనరీ ఏర్పాటుతో మె కానికల్, ఐటీ బ్రాంచీల్లో ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.

సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్..

నిర్మాణ రంగంలో కీలకమైన సివిల్ ఇంజనీర్లుకు త్వరలో భారీ డిమాండ్ ఏర్పడనుంది. అమరావతి రాజధానికి నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. రాజధానిలో నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చి వేగం పుంజుకోవడానికి కనీసం ఏడాది సమయం పడుతుంది. గతంలో ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాజధాని ప్రాంతంలో సివిల్ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఏర్పడనున్నది. మరోవైపు రాజధాని నిర్మాణాలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో నిర్మాణాలు వేగం పుంజుకోనున్నాయి. ఫలితంగా సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బిల్డర్లు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో దాదాపు సీట్లు మొత్తం భర్తీ అయ్యే పరిస్థితి నెలకొంది.

సామర్థ్యాలను మెరుగుపరచాలి

పాఠశాలల తనిఖీలో కలెక్టర్ అరుణ్‌బాబు సూచన

క్రోసూరు, జూలై 23: పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాల మెరుగుదలకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని విప్పర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ, ప్రీ ప్రైమరీ స్కూల్‌లో తనిఖీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత పాఠాలు చదివించి, వారికి పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తు న్నారా? లేదా? అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు నమోదును పరిశీలించారు. రిజిస్టర్ ప్రకారం స్టాక్ ఉన్నదో లేదో పరిశీలించాలని తహసీల్దార్ సువర్ణను ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. డాక్టర్లు క్రమం తప్పకుండా ఉంటున్నారా? లేదా అన్న వివరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని స్టాక్ రూమ్ వార్డుల



ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

క్యాంపు గది, ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్షల గదులను పరిశీలించారు. నెలలో ఎన్ని కాన్పులు చేస్తున్నారన్న వివరాలను విచారించారు. సీజనల్ వ్యాధులు, డయేరియా నమోదు గురించి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇన్నారావును ప్రశ్నించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో సత్తెనపల్లి ఆర్డీవో మురళి, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమారాణి, ఎంఈవో - 2 గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులకు అనుకూలం

● జపాన్ రాయబారి సుజుకి హిరోషితో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు



సుజుకి హిరోషికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

గుంటూరు, జూలై 23: ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులకు ఎంతో అనుకూలమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు జపాన్ రాయబారి సుజుకి హిరోషికి తెలిపారు. ఢిల్లీలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు జపాన్ రాయబారిని ప్రత్యేకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సత్సంబంధాలు, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు, రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ వసంతరాయుడు

పారిశుధ్యం లోపిస్తే ఎంపీడీవోలపై క్రమశిక్షణా చర్యలు

● జడ్పీ సీఈవో వసంతరాయుడు హెచ్చరిక

గుంటూరు సిటీ, జూలై 23: గ్రామాల్లో పారిశుధ్యం లోపించినా, మంచినీటి సరఫరాపై ఫిర్యాదులు వచ్చినా ఎంపీడీఓలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీబీఎస్ వసంతరాయుడు హెచ్చరించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. తొలుత సీఈఓ ఉమ్మడి జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన మొదటిదశ పనులపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మరో 53 గ్రామాలు ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆయా గ్రామాల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు కాల్వలు తీయించాలని, ప్రతి 15 రోజులకొకసారి గ్రామాల్లోని వాటర్ ట్యాంక్ శుభ్రపరచాలని సీఈఓ అన్నారు. తాగేనీటిని తప్పని సరిగా క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఉన్న 15వ ఆర్థికసంఘం నిధులను వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ జే మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీలు మధుసూదన్, దేబోరా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
ఏపీ వైస్ చైర్మన్‌గా మైనేని



మైనేని సత్యనారాయణ

వేమూరు, జూలై 23: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వేమూరు మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన మైనేని సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీప్‌మిశ్రా ఆదేశాలపై సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి సునీల్‌వర్మ మంగళవారం సత్యనారాయణకు నియామకపత్రాలను పంపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తూ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించారన్నారు. తద్వారా మహిళలు, యువత, నిరుద్యోగులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందించి వారి ఆర్థిక స్వావలంబనకు సహకరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఈ విధానం ద్వారా మోదీ ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాడు-నేడు అవినీతిపై విచారణ చేయాలి

● శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, జూలై 23: సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పేరుతో జగన్ చేసిన నాడు-నేడు పనుల్లో భారీ అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ఫేజ్-1, 2 కింద రూ.9వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇంకా రూ.4,700కోట్లు ఖర్చు చేస్తే కానీ పథక నిర్మాణం పూర్తి కాదన్నారు. ఈ పథకం ద్వారా అద్భుతాలు జరిగినట్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో టెండర్లు పిలిచి స్థానికంగా కావలసిన ఫర్నిచర్ కొనుగోలు చేసి వైసీపీ నాయకులే ఖర్చుబెట్టారని ఆరోపించారు. పొన్నూరు పురపాలక సంఘంలో ఈ పనులను పరిశీలిస్తే పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. పురపాలక సంఘం పరిధిలో ఐదు పాఠశాలలు పరిశీలిస్తే ఈ అవినీతి బాగోతం వెలుగు చూసినట్లు చెప్పారు. శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్‌లో పథకం కింద రూ.26లక్షలు ఖర్చు చేసి పాత నిర్మాణాలకే రంగులు వేయటం, పాత టాయిలెట్లనే కొత్తగా నిర్మించినట్లు చూపారని ఆరోపించారు. కిందిస్థాయిలో పేరెంట్స్ కమిటీ, హెచ్‌ఎంలను ఈ పథకానికి బాధ్యులుగా ఎంచుకున్నారని ఆరోపించారు. వైసీపీ పెద్దలు రాష్ట్రంలో దోచుకుంటే, పట్టణాలు, మండలాల్లో స్థానిక వైసీపీ నాయకులు పాఠశాలలను పంచుకుని ఇష్టారాజ్యంగా పనులు చేయకుండా డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. పాఠశాలల్లో బాగున్న నాపరాయి ఫ్లోరింగ్‌ను తొలగించి గ్రానైట్ రాయిని ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఫ్లోరింగ్‌లు వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పనులకు ఉచిత ఇసుక అని చెప్పి కాంట్రాక్టర్లకు బిల్లులు చూపించి మినహాయింపులు ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను వేదికగా చేసుకుని వైసీపీ పెద్దలు దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ పథకం కింద ప్రారంభించిన భవనాలు అసంపూర్తిగా ఆగిపోయి అగమ్య గోచరంగా మిగిలిపోయాయన్నారు. సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు.

రైతుల నుంచి ఫిర్యాదులొస్తే కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు

● ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నది ● కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులతో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు



మిర్చి కమీషన్, ఎగుమతి వ్యాపారులతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు రైతులు తెచ్చిన మిరపకాయలను విక్రయించిన 24 గంటల్లో నగదు చెల్లించాలి. ఈ విషయంలో కమీషన్ వ్యాపారస్థులదే పూర్తి బాధ్యతని మార్కెటింగ్ శాఖ జేడీ, యార్డు పర్సన్ ఇన్‌చార్జ్ కాకుమాను శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీన 'మిర్చి మాంద్యం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం మిర్చియార్డుకు వచ్చి ఆయన ఎగుమతి, కమీషన్ వ్యాపారస్థుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ సరుకు అమ్మిన వెంటనే తక్‌పట్టీ తప్పక తీసుకోవాలన్నారు. రైతులకు నగదు ఇచ్చే సమయంలో తక్‌పట్టీపై రైతు సంతకం విధిగా తీసుకోవాలని కమీషన్ వ్యాపారస్థులను ఆదేశించారు. రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు సొమ్మును అదే రోజు చెల్లించాలన్నారు. ఎవరైనా రైతులకు నగదు చెల్లించలేదని ఫిర్యాదులొస్తే విచారణ జరిపి కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌ని శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ యార్డులో నిత్యం మైకు ద్వారా ప్రకటనలు జారీ చేస్తామన్నారు. రైతులకు టోల్‌ఫ్రీ నెంబరుని కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. యార్డు వెలుపల జరిగే లావాదేవీలకు మార్కెట్ కమిటీకి సంబంధం ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, అసోసియేషన్ల నాయకులు జుగిరాజ్ భండారి, సుధాకర్, అప్పిరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాఫ్టుబాల్ ఉమ్మడి జిల్లా సీనియర్ జట్ల ఎంపిక



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల బృందం

క్రోసూరు, జూలై 23: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ సాఫ్టుబాల్ చాంపియన్ షిప్ కోసం బాలుర, బాలికల జట్లను మంగళవారం క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎంపిక చేశారు. బాలుర జట్టులో 18, బాలికల జట్టులో 18 మందిని ఎంపిక చేసినట్టు జిల్లా సెక్రటరీ శివపార్వతి తెలియజేశారు. బాలికల జట్టులో పీ జ్యోతిర్మయి, జీ నందిని, సీహెచ్ అనిత, షేక్ యాస్మిన్(క్రోసూరు సెయింట్ ఆన్స్), కే రోజా, ఈ లిడియ, కే దీవెన ఏంజల్, ఎన్ దుర్గామాధవి, జీ సునందిని, కే తేజశ్విని, హరిప్రియ, సీహెచ్ పావని, ఈ చంద్రిక, ఏ తిరుమల, పీ వర్షిక, బీ పూజిత, బీ సుప్రియ, చైతన్య ఎంపికైన వారిలో ఉన్నారు. బాలుర జట్టులో సాగర్ బాబు, బాబావలి, రాంబాబు, నాగూర్, ప్రేమ్‌కుమార్, షేక్ హయ్యూం, వీ సుజయ్, యూ నరేంద్ర, కే కుమార్, వీ సాయికుమార్, ఎం నల్క, కే సాగర్, ఎస్‌వీ నిషిత్ రెడ్డి, కే మంజిత్, పీ అమీర్, ఆర్ జేమ్స్, పీ హరినాగ సాయి, కే ఈశ్వర్ ఉన్నారు. ఎంపిక కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత, సాఫ్టు బాల్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ నరసిం హారెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పిడుగురాళ్ల, జూలై 23: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇరువురిపై పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదుచేశారు. పిడుగురాళ్లకు చెందిన బత్తుల శేఖర్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.3వేలకు కొనుగోలు చేసి పిడుగురాళ్లకు తీసుకొచ్చిన తరువాత పట్టణానికి చెందిన మురికిపూడి ప్రదీప్‌చంద్ర సహాయంతో చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కొక్క ప్యాకెట్ రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు మురికిపూడి ప్రదీప్‌చంద్ర వద్ద 1080గ్రాముల గంజాయి లభించగా, స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు. మురికిపూడి ప్రదీప్‌చంద్రను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు. బత్తుల శేఖర్ పరారీలో వున్నట్లు పోలీసులు తెలిపారు.

చెప్పులు షాపు నిర్వాహకుడు ఆత్మహత్య

గుంటూరు, జూలై 23: స్థానిక అరండల్‌పేట నాలుగోలైన్‌లో చెప్పులషాపు నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన ఎండ్లూరి శ్రీహరి(55) గీతాకేఫ్ ఎదురుగా చెప్పులషాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలురావడంతో అప్పులపాలయ్యాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కొద్దిరోజులుగా స్నేహితుల వద్ద అంటుండేవాడు. కాగా ముత్యాలరెడ్డిన గర్లోని ఇంటికి రంగులువేస్తుండటంతో భార్య బంధువుల ఇంటికివెళ్ళింది. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీహరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. అరండల్‌పేట పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు. శ్రీహరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించాలి

● నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు



మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, జూలై 23: ప్రభుత్వం గుంటూరు ఛానల్‌కు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు కోరారు. మండలంలోని నాగులపాడులో సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం వద్ద మంగళవారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగు, సాగునీటి సమస్యపై పోరాటం చేస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. గతంలో 5వేల క్యూసెక్కుల నీటి పారుదల సామర్థ్యంతో నల్లమడ ఆధునీకరణ చేపట్టేందుకు నిధులు కేటాయించారని, గత ప్రభుత్వం వాటిని రీటెండర్ల పేరుతో నిలుపుదల చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నల్లమడ వాగు ఆధునీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం గతంలో 21 రోజుల పాటు శాంతియుత నిరసనలు తెలియజేసిన రైతులు, మహిళలపై పోలీసు అధికారులు విచక్షణారహితంగా ప్రవర్తించి, అక్రమ కేసులు బనాయించారని, వీటిని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, బండి నాగేశ్వరరావు, కావు వెంకటసుబ్బారావు, లావు అంకమ్మచౌదరి, అడ్డగడ వెంకటేశ్వర్లు, మొవ్వా పెద్దన్న, బండి కామేశ్వరావు, కొల్లా రామన్, ఈదర భ్రమరాంబ, కొల్లా నిర్మల, లావు చౌడేశ్వరి, దొప్పలపూడి మంజూష, పాటిబండ్ల శ్రీనివాసరావు, కారుమంచి విజయ్‌కుమార్, బండి వెంకటశివరావు, ముత్తవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ ఎంపిక బీసీ వర్గాలకు సముచిత న్యాయం

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

తెనాలి అర్బన్, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడిని ఎంపికచేసి బీసీ వర్గాలకు సముచిత న్యాయం చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. మంగళవారం అమరావతిలో స్పీకర్‌ను కలిసి సత్కరించామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శాసనసభ సమావేశాలు అనైతిక దూషణలతో జరిగాయని, వీటిపట్ల ప్రజలు ఎంతో మనస్తాపం చెందారని చెప్పారు. పవిత్ర దేవాలయంతో సమానమైన శాసనసభలో ప్రజలకు అవసరమైన అంశాలపై స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరగాల్సివుండగా అలాంటి వాతావరణమే గత ప్రభుత్వం కల్పించలేకపోయిందన్నారు. ఈ దుష్ట సంప్రదాయాన్ని ప్రజలు గమనించి తగినవిధంగా వారికి బుద్ధి చెప్పారని, తప్పు తెలుసుకోకపోగా అదే రీతిని వైసీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సభను హుందాగా నడిపి ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు స్పీకర్ కృషి చేయాలని కోరామన్నారు. బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీహరి (ఫైల్‌ఫొటో)

మాచర్ల రూరల్, జూలై 23: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పశువేములలో జరిగింది. గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (65) మంగళవారం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సంఘటనలో శ్రీహరి కాళ్లు, చేతులు, ఉదర భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మరో రైతు దోసపాటి కనకయ్య విద్యుత్ లైన్‌మ్యాన్ హుస్సేన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్రీహరి మృతిచెందాడు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు శ్రీహరి భార్య కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీహరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

56,693 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,687 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 56,693 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,534 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17500	334	9000	15500
నెంబరు. 5	9000	11000	నెంబరు. 5	10000	10500
273	11000	13000	273	12500	12500
341	8500	16000	341	8500	15000
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000	తేజ	9300	18200
బ్యాడిగి	8500	17000	బ్యాడిగి	9000	12700
దేవనూరుడీలక్స్	10000	15000	దేవనూరుడీలక్స్	8000	10000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11200

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపు హర్షణీయం

● ప్రధానికి రెవెన్యూ మంత్రి అనగాని కృతజ్ఞతలు

రేపల్లె, జూలై 23: ప్రజానీకం ఎన్నికల్లో ఇచ్చిన మహోన్నతమైన తీర్పును గౌరవించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రప్రభుత్వం తమ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి నిధులు కేటాయించటం హర్షదాయకమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించటం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించటం రాష్ట్ర ప్రజల తరుపున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి సహాయం, గ్రామీణాభివృద్ధి పథకాలకు రూ.2.66లక్షల కోట్లు ప్రకటన, ఆక్వాసాగుకు ప్రోత్సహం పూర్వోదయ పథకం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక ప్రాజెక్టుల మంజూరు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. నీరు, విద్యుత్, రైల్వే, రోడ్ల ప్రాజెక్టులకు దశల వారీగా నిధులు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపకరిస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, తమకేమీ అధికార పదవులు వద్దని కేంద్రంతో చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంవైపు చూసేలా చెయ్యటంతో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్ ద్వారా ఈ స్థాయిలో నిధులు మంజూరు చెయ్యటం సాధ్యమైందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 23: రాజధాని అమరావతి అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15వేల కోట్లు బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్ల కేటాయింపుతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతంలో వెనుకబడిన జిల్లాలకు తగిన సాయం ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం నుండి సహకారం వుంటుందని, విశాఖ-చెన్నై కారిడార్, హైదరాబాద్ - బెంగుళూరు కారిడార్‌ల అభివృద్ధితో పాటు విద్యుత్, రైల్వే, రహదారుల అభివృద్ధికి దశల వారీగా నిధుల కేటాయింపుతో రాష్ట్రం అభివృద్ధి దిశగా మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 23: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని వేమూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపకరించేలా రూపకల్పన జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సమర్థతతోనే కేంద్రం నిధులు ప్రకటించడం జరిగిందన్నారు. కూటమి పాలనకు అపూర్వ విజయాన్ని ప్రజలు అందించారని, అందుకు ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించడం జరిగిందన్నారు. దానిని రాష్ట్ర ప్రయోజనాల కోసంగా వాడుతున్న చంద్రబాబు కృషి ఎంతో శ్లాఘనీయమన్నారు. జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిందని, తిరిగి రాష్ట్రాన్ని పురోభివృద్ధిలోకి తీసుకువెళ్ళేందుకు ఎంతో కష్టపడాల్సి వస్తుందన్నారు. ఈ విషయాలన్నింటిపై సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర పరిస్థితిని వివరించి బడ్జెట్‌లో ప్రాధాన్యాన్ని కల్పించడానికి ప్రధాన భూమిక పోషించారన్నారు. తద్వారా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మహిళలు తదితర అన్ని రంగాలకు బహుళ ప్రయోజనం కల్పించే కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ ఆమోదించక తప్పదు అన్నారు.

చంద్రబాబు, జగన్‌కు తేడాను చాటిచెప్పిన కేంద్ర బడ్జెట్

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 23: సమర్థుడి చేతిలో రాష్ట్రం ఉంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ఉదాహరణ అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మాజీ సీఎం జగన్‌రెడ్డికి మధ్య తేడా ఏంటో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు స్పష్టంగా చాటి చెప్పాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ఎన్డీఏ కూటమిలో చేరికపై అవాకులు, చవాకులు పేలినవారికి ఈ బడ్జెట్ చెంపపెట్టులాంటిదని జీవీ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధానికి రూ.15వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటించడం, రానున్న రోజుల్లో అదనపు నిధులు ఇస్తామని హామీపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం పూర్తికి అన్నివిధాలుగా సహకరిస్తామనడం ఎంతో విశ్వాసం ఇచ్చిందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి కింద నిధులు కేటాయించడం, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలకు ఆర్థికసాయం ఎంతో ఉపయోగపడనున్నాయని తెలిపారు. మనకు న్యాయంగా రావల్సిన నిధులు రాబట్టుకోలేని అసమర్థ ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. ఊసరవెల్లులు సైతం సిగ్గుపడే స్థాయిలో రోజుకో రంగు మార్చుతూ, పూటకో వేషం వేస్తోన్న జగన్‌రెడ్డి నిజస్వరూపాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఏరోజైనా కేసులు, కాంట్రాక్టర్లు తప్ప రాష్ట్రం, రాష్ట్రప్రయోజనాల గురించి ఆలోచించారా అంటూ వైసీపీ అధినేత జగన్‌రెడ్డిని ప్రశ్నించారు.

చంద్రబాబు కృషి వల్లే రాష్ట్రానికి ప్రత్యేక నిధులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి, సంప్రదింపుల ఫలితంగానే రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపులు జరిగాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌లకు ప్రత్తిపాటి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చూపిన అసమర్థతకు ప్రస్తుత సీఎం చంద్రబాబు అనుభవం, ముందుచూపునకు ఇదే నిదర్శనం అన్నారు. కేంద్రంలో పదవుల కన్నా, రాష్ట్రాభివృద్ధే ముఖ్యమన్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాటలకు అర్థం కూడా ఇప్పుడే అందరికీ అవగతమవుతోందని ప్రత్తిపాటి అన్నారు. కేంద్ర బడ్జెట్ నుంచి అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులతో పాటు వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు సాధించటం అభివృద్ధిపై తమకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో చంద్రబాబు ప్రయత్నాలకు ఇది ట్రైలర్ మాత్రమేనని, రానున్న ఐదు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ అన్నింటా అగ్రస్థానంలో నిలపటమే ఆయన లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రిగా ఢిల్లీ వెళ్ళినప్పుడు రాష్ట్రానికి ఏం తేవాలి?, ఇందుకోసం ఎలా ప్రయత్నించాలి?, నిధులు, పథకాలు ఎలా సాధించుకోవాలి? అనే అంశాలను చంద్రబాబును చూసి జగన్ నేర్చుకోవాలని హితవు పలికారు. ఐదు సంవత్సరాల తరువాత కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై ప్రత్యేక దృష్టి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి ప్రకటించిన వరాలు ఐదేళ్ల సమస్యలకు జవాబు ఇచ్చేలా విశ్వాసం కలిగించిందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏపీకి న్యాయం చేస్తానని ప్రధాని మోదీ చెప్పారని, చెప్పినవిధంగానే అమరావతికి రూ.15వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించటం అభినందనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకారం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల ప్రకటన ప్రజల్లో విశ్వాసం కలిగించాయన్నారు. ఏపీకి కేంద్రం సరైన గుర్తింపు, గౌరవం కల్పించిందని ఇది శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ వల్ల సాధ్యపడిందన్నారు. ఏపీకి నిధులు కేటాయించటంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, నియోజక వర్గ నాయకులు మద్దినేని నరసింహారావు, షేక్ దిలీప్, షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

ప్రకాశం బ్యారేజి గేట్లు మూసివేత

● డెల్టా కాలువలకు 7,700 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, జూలై 23: వాగుల నుండి వచ్చే వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం ప్రకాశం బ్యారేజి గేట్లను మూసివేసినట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర తదితర వాగుల నుండి 7వేల 700 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 7వేల 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



వేమవరంలో జనసేన సభ్యత్వ నమోదు చేస్తున్న జనసైనికులు

జనసేన క్రియాశీల సభ్యత్వాన్ని తీసుకోండి

● పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు

మాచవరం, జూలై 23: జనసేన పార్టీలో పనిచేసే ప్రతి జన సైనికుడు పార్టీ క్రియాశీల సభ్యత్వాన్ని తీసుకొని పార్టీ అభివృ ద్ధికి పాటుపడాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహిస్తామని, మంగళవారం మండలంలోని వేమవరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గతంలో 6 లక్షల సభ్యత్వాలు ఉన్నాయని, ఈసారి 10 లక్షల సభ్యత్వాలు నమోదు చేస్తామన్నారు. ఏమైనా ప్రమాదం జరిగి పాక్షిక అంగవైకల్యం గాని, మరణించినా గానీ సత్వర న్యాయం కింద రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతిఒక్కరు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకొని పార్టీ అభివృద్ధికి, వారి కుటుంబసంక్షేమానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వేమవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు కామిశెట్టి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రాఘవ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే జగన్ ఢిల్లీలో ధర్నా

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, జూలై 23: ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అన్యా యాలు, అక్రమాలు, తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధర్నా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల కోసం గానీ వైసీపీ నేతలు నిరసనలు చేశారా అని ప్రశ్నించారు. నెల రోజులు కూడా గడవని ప్రభుత్వంపై శాంతి భద్రతల పేరుతో ఢిల్లీలో ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల విచారణ, కోర్టు వాయిదాలను తప్పించుకోవడానికి జగన్ కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఆయన వెంట రాగిడి ప్రతాప్‌బాబు, గాదె పుల్లారెడ్డి, చిమటా వెంకటేశ్వర్లు, కొమ్ము కోటేశ్వరరావు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు వైభవంగా బోనాలు సమర్పణ



భోనాలతో ఊరేగింపుగా మహిళలు

మాచర్లటౌన్, జూలై 23: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో మంగళ వారం బోనాలు నిర్వహించారు. మహిళలు భోనాలు నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో పట్టణంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాచవరం, జూలై 23: మండలంలోని చెన్నాయపాలెంలో గ్రామదేవతలకు సుగాలీలు వైభవంగా బోనాలు సమర్పించారు. మేయరామ భవాని, సేవాలాల్ మహరాజ్ గ్రామదేవతలకు వైభవంగా బోనాలు సమర్పించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీ షీట్లు తెరుస్తాం

● ఎస్పీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం, జూలై 23: రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కే శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ గురునాథ బాబు, సీఐ శ్రీనివాసరావులతో మాట్లాడి పలు సూచనలు చేశా రు. డ్రంక్ డ్రైవ్‌లు నిర్వహించాలని, రోడ్డు భద్రతా నియమాల పై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. వివిధ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్టు చేయాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసుల స్థితి గతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి నిర్మూలనకై ప్రత్యేక టీమ్‌లు పెట్టి గంజాయి తాగుతున్నా, అమ్ముతున్న వారిపై నిఘా పెట్టి అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎస్పీ గురునాథబాబు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సంధ్యారాణి ఉన్నారు. ముందుగా ఆయన రాజుపాలెం, బెల్లంకొండ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని పెద నెమలిపురి, నాగిరెడ్డి పాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. చట్టాలను గౌరవించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని, ఎవరైనా రెచ్చగొట్టేలా మాట్లాడితే ఆవేశపడి గొడవలు పడి కేసుల్లో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, లేదంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అంతేగాని ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గ్రూపు తగాదాలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని, రౌడీ షీటు తెరుస్తామని హెచ్చరించారు. అవసరమైతే జిల్లా బహిస్కరణ చేస్తామన్నారు. రాజుపాలెం, బెల్లంకొండ పోలీసుస్టేషన్‌ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన పెదనెమలిపురి, నాగిరెడ్డిపాలెం గ్రామాలను ఆయన సందర్శించారు. అచ్చంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మాదిపాడు అవుట్ పోస్టును సందర్శించారు. క్రోసూరు, అచ్చంపేట పోలీసుస్టేషన్‌లను కూడా ఆయన తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌ల తనిఖీల్లో భాగంగా స్టేషన్ నిర్వాహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైయిరీ, క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సత్తెనపల్లి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.



బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామస్థులతో చర్చిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

వెల్దుర్తి, జూలై 23: ఆంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని, ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు అభివృద్ధి ఆశించి ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా కేంద్రం తమ వంతు కర్తవ్యంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అందించడం శుభపరిణామమన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం చేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థత తోనే కేంద్రం నిధులు విడుదల చేసిందని శివారెడ్డి అన్నారు.

వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపకల్పన

● బీజేపీ మాచర్ల అసెంబ్లీ కన్వీనర్ నాసరయ్య

మాచర్ల రూరల్, జూలై 23: వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరిగిందని బీజేపీ మాచర్ల అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య అన్నారు. మంగళవారం పార్లమెంట్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన మూడు జిల్లాలు, రాయలసీమలో నాలుగు జిల్లాలు, నూతనంగా ప్రకాశం జిల్లాను చేర్చి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమన్నారు.

పార్లమెంట్‌లో బడ్జెట్‌పై జనసేన హర్షం

మాచర్ల రూరల్, జూలై 23: బడ్జెట్‌పై జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిస్వార్థంగా రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహాయసహకారాలు అందిస్తోందన్నారు.

సత్తెనపల్లి, జూలై 23: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితో కేంద్రంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర రాజధానికి రూ.15వేల కోట్ల కేటాయించడంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. వెను కబడిన ఎనిమిది జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయించటం అభినందనీయమన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనటం సంతోషించ దగ్గ విషయం అన్నారు.

పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ కాంతారావు

కారంపూడి, జూలై 23: మండలంలోని లక్ష్మీపురం, కాకానివారి పాలెం, బ్రహ్మానాయుడు కాలనీ, వేపకంపల్లి, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారులకు మంగళవారం సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి కాంతారావు బోనస్‌లను పంపిణీ చేశారు. 604 మంది పాల ఉత్పత్తి దారులకు రూ.16 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రంగారావు, సూపర్‌వైజర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల డెయిరీ పరిధిలోని గ్రామాల్లో..



రైతులకు బోనస్ అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు, వున్నం శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల, జూలై 23: సంగం డెయిరీ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులకు మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు, గురజాల పాలకేంద్రం మేనేజర్ ఉప్పలపాటి రంగారావు, రూట్ సూపర్ వైజర్ ఇండ్లమూరి వెంకటేశ్వర్లు రైతులకు బోనస్ పంపిణీ చేశారు. అదేవిధంగా డీవీసీ అభయ ద్వారా పాల ఉత్పత్తి దారులకు డీఆర్‌ఎఫ్ స్కీమ్, పశువుల ఇన్సూరెన్స్, సబ్సిడీపై దాణా, జొన్నలు, గడ్డివిత్తనాలు అందిస్తున్నట్లు సంగం డెయిరీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. జానపాడులో 40లక్షల 5వేల 503 రూపాయలు, పందిటివారిపాలెంలో రూ.లక్షా 21వేల 359, పిడుగురాళ్లలో రూ.లక్షా 18వేల 499, జానపాడులో రూ.53 వేల 477ల బోనస్ ను పాల ఉత్పత్తిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వున్నం శ్రీనివాసరావు, ఆళ్ల నాగేశ్వరరావు, అంగడి శ్రీను, తదితరులున్నారు.

27న అరుణాచలంకు బస్సు

సత్తెనపల్లి, జూలై 23: సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 27వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. 27వ తేదీ సత్తెనపల్లిలో బస్సు బయలు దేరి 28వ తేదీ ఉదయం కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అనంతరం అరుణాచలం బయలు దేరుతుందన్నారు. 29వ తేదీ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసుకొని తిరిగి 30వ తేదీ సాయంత్రానికి సత్తెనపల్లి చేరుతుం దన్నారు. టిక్కెట్ ధర రూ.2500 అని ఆయన తెలిపారు. వివరాలకు 9959225429లో సంప్రదించాలన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మాచర్ల రూరల్, జూలై 23: మండలంలోని విజయపురిసౌత్ చెక్‌పోస్టు మంగళవారం అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎస్‌ఐ రవీంద్ర పట్టుకున్నారు. మాచర్ల పట్టణంలోని లింగాపురం కాలనీకి చెందిన బద్దెల చిన్నయ్య, వెల్దుర్తి మండలం కండ్లకుంటకు చెందిన నక్కా రామయ్యలు ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకొస్తున్నారు. విజయపురిసౌత్ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్ర ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 29బాటిళ్ల అక్రమ మద్యం గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

వెంకటప్పారెడ్డి మాస్టారును మరువలేం

పెదకూరపాడు, జూలై 23: వెంకటప్పారెడ్డి మాస్టారు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి వేలాది మందికి విద్యాబోధన చేశారని పూర్వవిద్యార్థి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి ఇంగ్లిషు, సోషల్ మాస్టార్ వై వెంకటప్పారెడ్డి మంగళవారం మృతి చెందారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 15 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాచర్లటౌన్, జూలై 23: గుర్తు తెలియని వ్యక్తి మాచర్ల పట్టణంలో మంగళవారం మృతి చెందాడు. పట్టణంలోని రైల్వేస్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉంది. గమనించిన రైల్వేస్టేషన్ మాస్టార్ కోమటినాయక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులకు అభినందనలు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, జూలై 23: పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులకు టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన అన్న క్యాంటీన్‌ను సందర్శించి పేదలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని, ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారని అన్నారు. ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో దాదాపు 150 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి ప్రజలకు రూ.5లకే మూడు పూటలా భోజనం అందించి ఆకలి తీర్చనున్నట్లు చెప్పారు. త్వరలోనే మహిళలందరికీ ఉచిత బస్సు ఏర్పాటవుతుందని, ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకు పింఛన్ అందిస్తామని, నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, పోలా సత్యం, దారువేముల రామకృష్ణ, చీదెళ్ల అంజనేయులు, జక్కా నరసింహారావు, బొట్టు కోటేశ్వరరావు, పద్మారెడ్డి, భవానిబాయి, దుర్భాకుల ప్రసాద్, పిన్నం శెట్టి కృష్ణ, మేకల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు : సీఐ బ్రహ్మయ్య



పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, జూలై 23: పట్టణ పరిధిలో ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బ్రహ్మయ్య మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు ఘర్షణలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు అందరూ సహకరించాలన్నారు. కొత్త వ్యక్తులు అనుమానంగా సంచరిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని సీఐ బ్రహ్మయ్య కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడవద్దు

సత్తెనపల్లి, జూలై 23: ప్రజలు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడొద్దని రూరల్ సీఐ రాంబాబు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతూ ఖాతాలను ఖాళీ చేస్తున్నారన్నారు. ఫోన్‌లలో వచ్చే లింకులను ప్రజలు తెరవకూడదన్నారు. ప్రజలకు ఎటువంటి అనుమానాలు వచ్చినా వెంటనే సమాచారం అందించాలన్నారు.

దివ్యాంగులకు వాకర్స్ అందజేత



ఆకులగణపవరంలో వాకర్స్ అందజేస్తున్న వైద్యులు కృష్ణకుమార్

రాజుపాలెం, జూలై 23: మండలంలోని ఆకుల గణపవరం గ్రామంలోని దివ్యాంగులకు స్థానిక వైద్యులు కేవీ కృష్ణకుమార్ మంగవారం వాకర్స్ అందజేశారు. గ్రామంలో 13 మందికి నెక్ బెల్టులు, లంబార్ బెల్ట్‌లు 52మందికి, వాకర్స్ 9మందికి, వాకర్స్ స్టిక్స్ 10మందికి కృష్ణకుమార్ అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి ఆలేఖ్య, మహిళ ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ఇన్‌చార్జి ఎంపీడీవో

దుర్గి, జూలై 23: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, అడిగొప్పుల, ఆత్మకూరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి ఉండాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ గ్రామసభల్లో ధర్మవరం సర్పంచ్ కొత్త రమాదేవి, జానకిరాము, సుబ్బారావు, శ్రీను, గౌరీశంకర్, పంచాయతీ సెక్రటరీ హఫీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి, జూలై 23: అంటువ్యాధులు సోకకుండా పరిశుభ్రత పాటించాలని ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని వేపకంపల్లి, పెదకొదమగుండ్ల గ్రామాల్లో స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్ ఆధ్వర్యాన సీజనల్ వ్యాధులపై గ్రామసభలు నిర్వహించారు.

బెల్లంకొండ, జూలై 23: అతిసార వ్యాధితో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం బెల్లంకొండ మండలంలోని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

అచ్చంపేట, జూలై 23: సీజనల్ వ్యాధులపై సచివాలయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి ఏవీ సుబ్బారావు అన్నారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు గ్రామంలో ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ మరుగుదొడ్లు, పారిశుధ్యంపై ఈనెల 30వ తేదీ లోపు సర్వే చేయాలన్నారు. ఆశావర్కర్ల ద్వారా కుటుంబాల వివరాలు, వ్యాధులు నమోదు చేయాలని సూచించారు.

పిడుగురాళ్ల, జూలై 23: పట్టణంలో ప్రతి వార్డులో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డులో పలు ప్రాంతాల్లో మురికికాల్వల్లో పూడికతీత, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు తొలగించడం వంటి పనులు చేపట్టారు. కమిషనర్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆయా పనులను పర్యవేక్షించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో డీ జయమణి

నకరికల్లు, జూలై 23 : ప్రభుత్వం ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ సేవల ప్రత్యేక డ్రైవ్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో డీ జయమణి కోరారు. మంగళవారం ఆమె నకరికల్లు సచివాలయంలోని ఆధార్‌సేవల అమలు తీరును పరిశీలించారు. ప్రతిఒక్కరు ఆధార్‌కు మొబైల్ లింక్‌ను, చిరునామాలో మార్పులను, పుట్టిన తేదీ నమోదులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ శాంతి, సచివాలయ ఉద్యోగులు ఆధార్ సేవల్లో పాల్గొన్నారు.

చేజర్ల, గుండ్లపల్లిలో నిలిచిన ఆధార్ సేవలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆధార్‌లో మార్పులు, చేర్పుల్లో అందాల్సిన సేవలు చేజర్ల, గుండ్లపల్లి సచివాలయాల్లో మంగళవారం నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతో సర్వర్లు పనిచేయటం లేదని సంబంధిత ఉద్యోగులు చెపుతున్నారు. సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేని కారణంగా ఆశించిన మేర ఆధార్‌సేవలు అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యల తలెత్తిన చోట సాంకేతిక సహకారాన్ని అందించి ఆధార్ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రామాలకు నూతన సర్పంచులు



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసిన నూతన సర్పంచులు పసుపులేటి వెంకటస్వామి, పేతురు

రాజుపాలెం, జూలై 23: మండలంలో బీర వల్లిపాయ, చౌట పాపాయపాలెం గ్రామాలకు నూతన సర్పంచులు ఎన్నికయ్యారు. సర్పంచుల ఎన్నికకు ముందుగా అనుకున్న ఒప్పందం మేరకు ఇప్పటి వరకు ఆ రెండు గ్రామాలకు ఉన్న సర్పంచులు సెలవుపై వెళ్లటంతో ఉప సర్పంచులుగా ఉన్న పసుపులేటి వెంకటస్వామి, పేతురులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. దీంతో వారు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి మంగళవారం ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నా సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



పునాది అభ్యసన సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనుభవాలతో కూడిన అభ్యసనను అందించాలి

● ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్ లలిత

నకరికల్లు, జూలై 23: పిల్లలకు అనుభవాలతో కూడిన అభ్యసనను అందించాలని ఇన్‌చార్జ్ చేజర్ల జడ్పీ హైస్కూల్ ఇన్ చార్జ్ హెచ్‌ఎం సూర్యదేవర లలిత మంగళవారం గణితంలో పునాది, అభ్యసన సంకల్పయాత్ర, అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పునాది అభ్యసన సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేశారు. జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు గేరా మోహనరావు, పఠాన్, మాలిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, ఏసీహెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. అంతర పంటలమయం

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

రాజుపాలెం, జూలై 23: మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయ రైతులు ప్రణతి, గుర్రాల మల్లికార్జునరావుల వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ అంతర పంటల వల్ల ప్రధాన పంటకు వచ్చే తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి, గులాబీ రంగు పురుగు పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. వ్యవసాయ క్షేత్రంలో మిత్రపురుగుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని దీనివల్ల ఎటువంటి చీడపీడలు ఆశించవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాచేపల్లి ఎంఈవోగా అదనపు బాధ్యతల స్వీకరణ

దాచేపల్లి, జూలై 23: దాచేపల్లి ఎంఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు కె.కాంతారావు చేపట్టారు. మంగళవారం దాచేపల్లి ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు కాంతారావును కలిసి సన్మానించారు. దాచేపల్లితో పాటు వెల్దుర్తి, గురజాల, కారంపూడి, మాచర్ల మండలాల్లో కూడా ఎంఈవోగా కాంతారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో పనివేళలు సక్రమంగా జరిగేవిధంగా ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

తైక్వాండో పోటీల్లో గురజాలకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న హనుమాన్

గురజాలటౌన్, జూలై 23: ఫస్ట్ ఇంటర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ తైక్వాండో అండర్ 76 కేజీ సీనియర్ విభాగంలో గురజాలకు చెందిన కరాటే మాస్టర్ డి హనుమాన్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని విజయభాస్కరరెడ్డి స్టేడియంలో గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. గురజాలలో కొరియన్ కరాటే మాస్టర్‌గా హనుమాన్ కోచింగ్ అందిస్తున్నారు.

అంబటి రాంబాబుకు ప్రాణహాని లేదు

● భద్రత అవసరంలేదని ఎస్పీ నిర్ణయం.. సవివరంగా ఉత్తర్వులు

● హైకోర్టుకు నివేదించిన న్యాయవాది.. విచారణ 30కి వాయిదా

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తనకు 4ప్లస్4 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ పిటిషనర్ సమర్పించిన వినతిని గుంటూరు జిల్లా ఎస్పీ పరిగణనలోకి తీసుకున్నారని, అన్ని వివరాలూ పరిశీలించి ఎలాంటి ప్రాణహానీ లేదని నిర్ణయానికి వచ్చారని తెలిపారు. సవివరంగా ఉత్తర్వులూ జారీ చేశారని వివరించారు. ఎస్పీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ప్రస్తుత వ్యాజ్యాన్ని ఉపసంహరించుకొని ఎస్పీ ఆదేశాలను సవాల్ చేస్తూ తాజాగా వ్యాజ్యం దాఖలు చేసుకోవడమో, లేక ఉన్నతాధికారులను ఆశ్రయించడమో చేయాలని అంబటి రాంబాబుకు హైకోర్టు సూచించింది. దీనిపై ఏ విషయం చెప్పాలంటూ విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్‌ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ నేత సాంబిరెడ్డిపై దాడి

అమరావతి, జూలై 23: నియోజకవర్గంలోని 78 త్యాళ్లూరుకు చెందిన వైసీపీ నాయకుడు క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన ఘటన మంగళవారం సాయంత్రం ఉంగుటూరు-కంభంపాడు గ్రామాల మధ్య రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే సాంబిరెడ్డి మరో ముగ్గురు కలసి గుంటూరు నుంచి తమ గ్రామానికి కారులో వస్తుండగా ఉంగుటూరు కంభంపాడు రహదారిలో గుర్తుతెలియని వ్యక్తులు సాంబిరెడ్డి కారును ధ్వంసం చేసి అతనిపై దాడి చేశారు. గాయపడిన అతడిని బంధువులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రికార్డులను సక్రమంగా ఉంచండి : ఎంపీడీవో

పిడుగురాళ్ల, జూలై 23: గ్రామ పంచాయతీలలో రికార్డులను సక్రమంగా ఉంచాలని ఎంపీడీవో సుబ్బారావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఆయా గ్రామాల్లో కాల్వల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లడం, వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం వంటి పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయించాలన్నారు.

ప్రజా రవాణా పటిష్టం చేస్తాం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



కొత్త బస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 23: ప్రజా రవాణా పటిష్టం చేసి, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట బస్సు స్టేషన్‌లో నూతనంగా సమకూర్చిన మూడు ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గతంలో బస్సులు కొనుగోలు మాటే లేకుండా డొక్కు బస్సులతో కాలం నెట్టుకొచ్చారని అన్నారు. ఫలితంగా ఆర్టీసీలో ప్రయాణం అంటే ప్రజలు ముప్పు తిప్పలు పడే పరిస్థితి ఉండేదని, ప్రజల గురించి ఆలోచించే కూటమి కొత్త బస్సులు కల్పించి ప్రజలకు మెరుగైన పాలన అందించనుందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామి, బండారుపల్లి విశ్వేశ్వరరావు, కన్యదార రాజు, చింతిరాల బాలు, మాతంగి బంగారం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 23: వేలాది ఎకరాలను సస్యశామలం చేసే నాగార్జున సాగర్ కుడికాలువ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా 136 కిలోమీటర్ల మేర సాగునీరు అందుతోందన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ.5వేల కోట్లతో ఆధునికీకరణ పనులు చేశారని, కానీ 2019-24 మధ్యకాలంలో జగన్‌రెడ్డి రూపాయికూడా కేటాయించలేదని, కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలు ఏస్థాయిలో విధ్వంసానికి గురయ్యాయో, వ్యవసాయం ఎంత నిర్లక్ష్యానికి గురైందో అర్థమవుతుందన్నారు. కాలువలో పూడిక, తూడు, తుమ్మచెట్లు పెరిగిపోయి నీరుపారే అవకాశమే లేకుండా పోయిందన్నారు. వ్యవసాయాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందన్నారు. పోలవరాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, అందులో కొంతమేరకు సాగర్ కుడికాలువపై పెట్టాలని కోరారు.



బోనాలతో దేవాలయం వద్దకు వచ్చిన మహిళలు

ఘనంగా ఎల్లమ్మతల్లి బోనాలు

శావల్యాపురం,జూలై 23: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని పోట్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న మావురాల ఎల్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనాల వేడుకలను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కలసి ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు దేవాలయం వద్దకొచ్చి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. కనమర్లపూడి, శావల్యాపురం, కృష్ణాపురం, పోట్లూరు గ్రామాల నుంచి మహిళలు మట్టికుండల్లో బోనాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో దేవాలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. తెలంగాణకు చెందిన నృత్య కళాకారులు ప్రత్యేక వేషధారణలతో ఊరేగింపులో పాల్గొని భక్తులను అలరించారు. అనంతరం మహిళలు ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. పసుపు, కుంకుమలు, చీరెసారెలను కానుకగా సమర్పించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో భక్తులు భజనలు చేశారు.

హాస్య కళాకారుడు కట్టెంపూడి జయప్రకాష్ మృతి



జయప్రకాష్ (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, జూలై 23: నాటరంగానికి చెందిన హాస్య కళాకారుడు కట్టెంపూడి జయప్రకాష్ (71) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. ఆయన దివంగత సీనియర్ న్యాయవాది అల్లు సీతరామయ్య వద్ద న్యాయవాద గుమస్తాగా పనిచేసిచేశారు. సాహిత్యరంగంలో నాటికలు రాయడం, నాటకాలకు దర్శకత్వంవహించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జయప్రకాష్ మృతి చెందారని తెలుసుకున్న కళాకారు, సాంఘీక నాటకం కళాకారులు, డాన్సు మాస్టర్స్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తాం

● నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్

నరసరావుపేట టౌన్, జూలై 23: రాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ప్రతిభావంతులైన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారం, ఆర్థికసాయం అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దిరాల గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన, నీట్ మెడికల్, పీజీ మెడికల్, ఎంసెట్ ఇంజనీరింగ్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేస్తామన్నారు. కొడాలి జనార్దన్‌రావు, రాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ, డోర్ నెంబర్: 37-12-2080, ఆదిత్యా నగర్, ఫస్ట్ లైన్, రెడ్డిపాలెం పోస్ట్, గుంటూరు, 522509 అనే చిరునామాకు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9573381525, 9393138248 నంబర్లను సంప్రదించాలన్నారు.

బుచ్చిపాపన్నపాలెంలో సీజనల్ వ్యాధులపై అవగాహన

రొంపిచర్ల, జూలై 23: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డెంగీ, డయేరియా, పెద్ద వారికి వేసే టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లూర్దు శౌరీలు, హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్లు, ఆషా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలో జగన్ ధర్నా

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, జూలై 23: ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అన్యాయాలు, అక్రమాలు, తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధర్నా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల కోసం గానీ వైసీపీ నేతలు నిరసనలు చేశారా అని ప్రశ్నించారు. నెల రోజులు కూడా గడవని ప్రభుత్వంపై శాంతి భద్రతల పేరుతో ఢిల్లీలో ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల విచారణ, కోర్టు వాయిదాలను తప్పించుకోవడానికి జగన్ కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఆయన వెంట రాగిడి ప్రతాప్‌బాబు, గాదె పుల్లారెడ్డి, చిమటా వెంకటేశ్వర్లు, కొమ్ము కోటేశ్వరరావు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మాచర్ల రూరల్, జూలై 23: మండలంలోని విజయపురిసౌత్ చెక్‌పోస్టు మంగళవారం అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎస్ఐ రవీంద్ర పట్టుకున్నారు. మాచర్ల పట్టణంలోని లింగాపురం కాలనీకి చెందిన బద్దెల చిన్నయ్య, వెల్దుర్తి మండలం కండ్లకుంటకు చెందిన నక్కా రామయ్యలు ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకొస్తున్నారు. విజయపురిసౌత్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రవీంద్ర ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 29బాటిళ్ల అక్రమ మద్యం గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.





పెరుమాలపల్లి మేజరు కాలవలో డోజర్‌తో మట్టిని తొలగిస్తున్న అధికారులు, చెత్తను తొలగించడంతో శుభ్రంగా ఉన్న కాలువ

పెరుమాలపల్లి మేజరు కాలువలో చెత్త తొలగింపు

వినుకొండ టౌన్, జూలై 23: గత వైసీపీ పాలనలో పట్టణంలో చెత్తతో నిండిపోయి అస్తవ్యస్తంగా ఉన్న పెరుమాలపల్లి మేజర్ కాలవను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచన మేరకు శుభ్రం చేసేందుకు మున్సిపల్ అధికారులు నడుంబిగించారు. కాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లను, పొదలను తొలగించారు. కాలవలో పూడికను డోజర్లు, పొక్లెయిన్ల సాయంతో తొలగించారు. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా కాలవ పరిశుభ్రంగా కనిపిస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కాలవనీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. స్థానికులు కాలవలో చెత్తవేయవద్దని సూచించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఏరువాక ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్ నగేష్



చిరుమామిళ్ళలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

నాదెండ్ల, జూలై 23: పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారని ఏరువాక ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్ ఎం నగేష్ అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామ పరిధిలోని పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రసం పీల్చే పురుగుల నివారణ కోసం 20, 40, 60 రోజుల వ్యవధిలో కాండం పూత మందు (మోనోక్రోటోఫాస్ 1:4) నివారించవచ్చన్నారు. లాంపాం శాస్త్రవేత్త ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పూత, పిందె రాలకుండా ఉండేందుకు 45,60,80 రోజుల కాల వ్యవధిలో బోరాన్‌ను పిచికారి చేయాలన్నారు. లింగాకర్షక బుట్టలు పెట్టడం ద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించ వచ్చన్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు, జూలై 23: మండలంలోని సొలస, లింగారావుపాలెం గ్రామాలలో ఏరువాక శాస్త్రవేత్తల బృందం మంగళవారం పర్యటించింది. ఆయా గ్రామాల పరిధిలోని పత్తి పొలాలను బృందం పరిశీలించింది. ప్రస్తుత వర్షాలకు పత్తి పంట దెబ్బతినకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ప్రధానంగా పొలంలో త్వరగా అంతర కృషి చేయడంతోపాటు ఎకరానికి 2కిలోల మల్టీ కెను 200మి.లీల నీటిలో కలుపుకుని పైరుపై పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే 30రోజులు దాటిన పత్తి పైరులో ఎకరాకు 50కిలోల యూరియా, 50కిలోల డీఏపీ, 25కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ మందును 1:4 నిష్పత్తిలో కలుపుకుని కాండంకు పూత పూయడం ద్వారా సమర్ధవంతంగా నివారించుకోవచ్చన్నారు. అలాగే పొలంలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకుని గులాబి రంగు పురుగు ఉధృతిని గమనిస్తూ తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరువాక విస్తరణ శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు మాట్లాడుతూ పత్తిలో అంతరపంటగా స్వల్పకాలిక రకాలైన పెసర, మినుము, కొర్ర వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఎంఏవో సీహెచ్ సరిత, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అడవి పేరంటాలమ్మ ఆలయంలో చోరీ



దేవాలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

బొందిలిపాలెం (శావల్యాపురం) జూలై 23: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం దేవాలయంలో పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత వాచ్‌మెన్ గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మంగళవారం ఉదయాన్నే దేవాలయం వద్దకు రాగానే తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈశాన్యంలోని గేటు తాళాలు పగులగొట్టి, లోనికి ప్రవేశించి గేటుకున్న గడులను వంచివేసి తాళాలు పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. దేవాలయంలోని రెండు హుండీలు పగులగొట్టి వాటిలోని నగదును, పక్కనే ఉన్న ఇనుప బీరువాలోని అమ్మవారి చీరెలు, నాలుగు సీసీటీవీ కెమేరాలు, కెమేరాల కోసం అమర్చిన టీవీ తదితర సామగ్రిని అపహరించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే స్థానిక పోలీసులకు, దేవదాయశాఖ అధికారులకు సమాచారం అందించగా ఎస్ఐ చల్లా సురేష్, ఈవో పుణ్యాల వెంకటరెడ్డి తమ సిబ్బందితో దేవాలయం వద్దకు చేరుకొని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఎస్ఐ చల్లా సురేష్ సమాచారం మేరకు క్లూస్‌టీం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుల వేలిముద్రలు, చోరీకి సంబంధించిన ఆధారాలు సేకరించారు. సీసీకెమేరాలు ఉన్నప్పటికీ గుర్తుతెలియని వ్యక్తులు దేవాలయంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇదే తరహాలో దేవాలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీలను పగులగొట్టి నగదును అపహరించారు. చోరీ ఘటనపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలకు చేరిన సాగర్ జలాలు

నూజెండ్ల, జూలై 23: తాగునీటి చెరువులు నింపేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు మంగళవారం జమ్మలమడక, మోదేపల్లి మేజర్లలో ప్రవహిస్తున్నాయి. ములకలూరు, తలార్లపల్లి, రవ్వవరం, జెడ్డావారిపాలెం, మృత్యుంజాపురం, నూజెండ్ల, గుర్రపునాయుడుపాలెం రక్షిత తాగునీటి పథకాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్ అధికారులు సిబ్బందితో నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ లక్ష్మీపతి

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా: ఏఎస్పీ లక్ష్మీపతి

వినుకొండటౌన్, జూలై 23: ఈ నెల 17వ తేదీన జరిగిన హత్యాఘనపై వినుకొండ పట్టణంలో పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చేపట్టారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేశారు. సోమవారం పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీపతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మండలాల పోలీసులు, ప్రత్యేక బలగాల సాయంతో శివయ్య స్థూపం సెంటర్ నుంచి పెద్ద మసీదు మీదుగా ఆర్టీసీ డిపో వరకు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరిగినా, జరుగుతాయని సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇప్పటికే అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, శాంతిభద్రతలపై ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సాంబశివరావు, సుధాకర్, పట్టణ ఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి: డీఈవో

వినుకొండ టౌన్, జూలై 23: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు తగ్గాయని, తగ్గిన ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలని పల్నాడుజిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని నిర్మలా పాఠశాల్లో నియోజకవర్గం స్థాయిలో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ లెర్నింగ్ పరిశీలనపై ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ టీచ్ టూల్ లెర్నింగ్ కార్యక్రమం ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారికి కేటాయించిన తరగతులలో బోధనా విధానాన్ని నిశితంగా పరిశీలించి, అవసరమైన సూచనలు చేయటం ద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జఫ్రుల్లా పాటు ఆర్‌పీలు ప్రతాప్, ఏపీ రామారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాకర్స్ అందజేత

రాజుపాలెం, జూలై 23: మండలంలోని ఆకులగణపవరంలో దివ్యాంగులకు స్థానిక వైద్యుడు కేవీ కృష్ణకుమార్ మంగవారం వాకర్స్ అందజేశారు. గ్రామంలో 13మందికి నెక్ బెల్టులు, లంబార్ బెల్ట్‌లు 52మందికి, వాకర్స్ 9మందికి, వాకర్స్ స్టిక్స్ 10మందికి కృష్ణకుమార్ అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ అలేఖ్య, మహిళ ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీవో

బొల్లాపల్లి, జూలై 23: ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వీ విజయ కుమార్ మంగళవారం కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం ఆధార్ అప్‌డేట్ చేసుకోవటానికి, ఆధార్ లేని వారు కొత్తగా నమోదు చేసుకోవటానికి ఈ నెల 27వ తేదీ వరకు మండల పరిధిలోని సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ళు ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో ఆధార్ ఎన్‌రోల్ క్యాంపులు ఏర్పాటుచేయటం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. 24వ తేదీ మూగచింతలపాలెం గ్రామ సచివాలయం, కనమల చెరువు గ్రామ సచివాలయాల్లో, 25 రేమిడిచర్ల, పలుకూరు గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో, 26న రావులాపురం, పేరూరుపాడు, మేళ్ళవాగు ఎంపీయూపీ స్కూల్‌లో, 27న గుట్లపల్లి, వడ్డెంగుంట, గండిగనుముల ఎంపీయూపీ సచివాలయాల్లో ఆధార్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక

నరసరావుపేట టౌన్, జూలై 23: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా కార్యవర్గ ఎన్నిక నరసరావుపేట పట్టణంలో మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పాలేటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నడింపల్లి సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శాఖమూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మాగంటి రామచంద్రరావు, కోశాధికారిగా యాదాల వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా దారా ఆరోన్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా ఏలూరి అనంతమ్మ, కార్యవర్గ సభ్యులుగా పరిమి సుబ్బారావు, టి.లక్ష్మణరావు, ఎస్.రామసుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, రాగినేని వేమలయ్య, మోతాడు హైదర్‌వలి ఎన్నికైయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి తల్లపనేని రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మక్కపాటి రాంబాబు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



చీకటీగలపాలెం మిరప షేడ్ నెట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

విత్తన షాపుల్లో అధికారుల తనిఖీ

● రూ.4,50,850 విలువ చేసే విత్తన విక్రయాల నిలిపివేత

వినుకొండ టౌన్, జూలై 23: ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని విత్తన షాపుల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. తనిఖీలో బిల్లులు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు కాని సుమారు రూ.4,50,850 విలువచేసే విత్తనాలను గుర్తించి, వాటి విక్రయాలు నిలిపివేసినట్లు వారు వెల్లడించారు. అనంతరం చీకటీగలపాలెం గ్రామ సమీపంలోని మిరప షేడ్‌నెట్ నర్సరీలను పరిశీలించారు. అనంతరం నెట్ యజమానితో మాట్లాడుతూ నర్సరీలో ఎవరైతే నారు పెంచుతున్న వారి వివరాలు, రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారుల సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏడీఏ సీహెచ్ రవికుమార్, కమిషనర్ కార్యాలయం అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, డీడీఏ రమణమూర్తి, మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి, ఏడీఏ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్లు ● ఎస్పీ శ్రీనివాసరావు



నాగిరెడ్డిపాలెం గ్రామస్థులతో చర్చిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం, జూలై 23: రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కే శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ గురునాథ బాబు, సీఐ శ్రీనివాసరావులతో మాట్లాడి పలు సూచనలు చేశా రు. డ్రంక్ డ్రైవ్‌లు నిర్వహించాలని, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. వివిధ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్టు చేయాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసుల స్థితి గతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి నిర్మూలనకై ప్రత్యేక టీమ్‌లు పెట్టి గంజాయి తాగుతున్నా, అమ్ముతున్న వారిపై నిఘా పెట్టి అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎస్పీ గురునాథ బాబు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంధ్యారాణి ఉన్నారు. ముందుగా ఆయన రాజుపాలెం, బెల్లంకొండ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని పెద నెమలిపురి, నాగిరెడ్డి పాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, టీడీపీ కౌన్సిలర్ల నాయకుడు గంగా శ్రీను తదితరులు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమీక్షలతో

పారిశుధ్యంపై కదిలిన మునిసిపల్ యంత్రాగం

చిలకలూరిపేట, జూలై 23: స్థానిక శాసన సభ్యుడు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మునిసిపాలిటీ పనితీరును తక్షణం మెరుగుపరచాలని కమిషనర్ గోవిందరావును, ఇతర విభాగాల వారిని ఆదేశించిన నేపథ్యంలో మునిసిపల్ యంత్రాంగం ఇందుకు అనుగుణంగా రంగంలోకి దిగింది. గత కొద్ది రోజులుగా ప్రత్తిపాటి తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి మునిసిపల్ విభాగాల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ ఉన్నారు. పట్టణంలో పరిస్థితిని తక్షణం సరిదిద్దాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మునిసిపల్ కమిషనర్ గోవిందరావు పట్టణమంతా కలియ తిరిగి పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. శారదా హైస్కూల్, వేలూరు రోడ్డు, మార్కెట్ సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నంలోని పశువుల ఆస్పత్రి వద్ద ప్రధాన డ్రెయిన్‌ను పరిశీలించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. నెల రోజుల వ్యవధిలో పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దాలని ప్రత్తిపాటి సూచనల ప్రకారం పనిచేయిస్తామని, ప్రజలు సహకరించాలని కమిషనర్ గోవిందరావు ఈ సందర్భంగా కోరారు. ఆయన వెంట మునిసిపల్ ప్రతిపక్ష నేత గంగా శ్రీనివాసరావు, టీడీపీ నేత పట్టణ శాఖ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, మురకొండ మల్లిబాబు, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో పిచ్చి కుక్క స్వైర విహారం

నాదెండ్ల జూలై 23: మండలంలోని జంగాలపల్లిలో మంగళవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. నాలుగు గేదెలను, ఐదు ఆవులను ఆ పిచ్చికుక్క గాయపరిచింది. దీంతో ఆందోళన చెందిన పశుపోషకులు ఈ విషయాన్ని నాదెండ్ల పశు వైద్యాధికారి డాక్టర్ ఏడుకొండలుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన తన సిబ్బందితో గ్రామానికి వచ్చి గాయపడ్డ పశువులకు ర్యాబిస్ టీకాను వేశారు. మూడు రోజులపాటు పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా నలుగురు గ్రామస్థులు, ఐదు గేదెలను కుక్కలు గాయపరిచాయని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల భారీ నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యడ్లపాడులో పట్టపగలు చోరీ

● రూ.30వేలు.. ఐదు సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



దొంగలు పగలగొట్టిన బీరువా

యడ్లపాడు, జూలై 23: మండల కేంద్రమైన యడ్లపాడులోని ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పోలీసుస్టేషన్‌కు అతి సమీపంలోని వడ్డెర కాలనీలో జరిగిన ఈ ఘటన ఆందోళన కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేరంగుల శివయ్య, దేవి కుమారుడు బ్రహ్మయ్యలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా కుమార్తె ఇంటర్ చదువుతోంది. మంగళవారం ఉదయం కుమార్తె కాలేజీకి కుమారుడు వ్యక్తిగత పనులపై బయటకు వెళ్ళగా శివయ్య దేవిలు కూలిపనులకు వెళ్ళారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్రహ్మయ్య ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో లోనికి వెళ్ళి చూడగా గునపంతో బీరువా, అందులోని లాకరు తెరిచి ఉండడంతో పాటు అందులోని వస్తువులు చిందరవందరగా కిందపడి ఉన్నాయి. దీనితో బ్రహ్మయ్య చోరీ జరిగిందని గమనించి పనికి వెళ్ళిన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఇంటికి వచ్చిన దేవి, శివయ్యలు బీరువాలోని లాకరులో దాచిన రూ.30వేల నగదు, ఐదు సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై దేవి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

నేడు కనపర్రులో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, జూలై 23: మండలంలోని కనపర్రులో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9:30గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాలిక అదృశ్యం

యడ్లపాడు, జూలై 23: యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ళ బాలిక అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన బాలిక ఏడో తరగతి చదువుతూ మధ్యలో మానేసింది. అప్పటి నుంచి తల్లిదండ్రుల వెంట పొలం పనులకు వెళుతోంది. ఇటీవల తల్లిదండ్రులు బాలికకు వివాహ సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి ఇష్టంలేని బాలిక మంగళవారం తెల్లవారు జామున బట్టలు సర్దుకుని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

27న అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి, జూలై 23: సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 27వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. 27వ తేదీ సత్తెనపల్లిలో బస్సు బయలుదేరి 28వ తేదీ ఉదయం కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అనంతరం అరుణాచలం బయలు దేరుతుందన్నారు. 29వ తేదీ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసుకొని తిరిగి 30వ తేదీ సాయంత్రానికి సత్తెనపల్లి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.2500 అని ఆయన తెలిపారు. సత్తెనపల్లి ప్రాంతంలోని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9959225429లో సంప్రదించాలన్నారు.